

# మనం
## ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం-మహబూబాబాద్

శుక్రవారం | 15 | సెప్టెంబర్ | 2023 | పేజీలు : 9


## చంద్రబాబు అరెస్ట్‌పై మంత్రులు తలోమాట

**ఖండించిన మంత్రి పువ్వాడ**

**ఏపీలో రెండు పార్టీల మధ్య గొడవ జరుగుతోంది**

**మంత్రి హరీశ్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు**

**ఖమ్మం, సెప్టెంబర్ 14(మనం బ్యూరో) :** స్కిల్ డెవలప్ మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్ట్‌పై రాష్ట్ర మంత్రులు హరీష్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ తలో మాట మాట్లాడారు. ఖమ్మంలో ఇద్దరు మంత్రులు పర్యటన జరిగింది. మమత మెడికల్ కాలేజీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో మంత్రి పువ్వాడ ప్రసంగిస్తూ చంద్రబాబు అరెస్ట్‌ను పువ్వాడ ఖండించారు. ఇది బాధాకరమన్నారు. గవర్నర్ అనుమతి లేకుండా చంద్రబాబును అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ప్రజా అవసరాల కోసం ముఖ్యమంత్రులు అనేక నిర్ణయాలు తీసుకుంటారని, రాజకీయాల్లో కక్ష సాధింపు చర్యలు మంచిది కాదని పువ్వాడ వ్యాఖ్యానించారు. వైద్య ఆరోగ్య శాఖా మంత్రి హరీశ్ రావు మాత్రం ఓ న్యూస్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు అరెస్ట్ ఏపీలో రెండు రాజకీయ పార్టీల మధ్య జరుగుతున్న గొడవ అని అన్నారు. దీంతో బీఆర్ఎస్ కు సంబంధం లేదని చెప్పారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని వ్యాఖ్యానించారు.

# కేసీఆర్ సారధ్యంలో పారదర్శక పాలన

**– మమత సంస్థలు వైద్య కళాశాలలకే ఆదర్శం**
**– రాష్ట్ర రాజకీయాలలో చరిత్ర కలిగిన వ్యక్తి పువ్వాడ**
**–రాష్ట్ర ఆర్థిక, వైద్య శాఖ మంత్రి హరీష్ రావు**
**– ఘనంగా మమత సంస్థల రజతోత్సవాలు**







**ఖమ్మం, సెప్టెంబర్ 14(మనం బ్యూరో) :** ముఖ్యమంత్రి కేసిఆర్ సారధ్యంలో తెలంగాణలో పారదర్శక పాలన సాగుతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి మంత్రి తన్నీరు హరీష్‌రావు తెలిపారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉన్న సీట్లలో 43 శాతం తెలంగాణలోనే ఉన్నాయని మంత్రి తెలిపారు. గురువారం ఖమ్మంలో మమత వైద్య సంస్థల రజతోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మమతలో నూతనంగా నిర్మించిన సిల్వర్ జూబ్లీ బ్లాక్ను ప్రారంభించారు. మమత సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు పువ్వాడ నాగేశ్వరరావు 85వ జన్మదినోత్సవ కార్యక్రమాలు, మమత సంస్థల రజతోత్సవ కార్యక్రమాలను మమత ఆసుపత్రి ప్రాంగణంలో సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహుతులను మమత సంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ వేదికపైకి ఆహ్వానించగా మమత సంస్థల అధ్యక్షులు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సభకు అధ్యక్షత వహించారు. పువ్వాడ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేశారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో హరీష్ రావు మాట్లాడుతూ 25 ఏళ్లుగా రాష్ట్రంలో దిన దినాభివృద్ధి చెందుతున్న మమత వైద్య సంస్థలు వేలాది మంది ప్రాణాలను కాపాడాయన్నారు. అనేక మంది వైద్యులుగా తీర్చిదిద్దిన ఘనత మనుత సంస్థలకు దక్కుతుందన్నారు. నిరంతర పట్టుదల, మమత సంస్థలను ఈ స్థాయికి చేర్చిందని అప్పట్లో ప్రైవేటు యాజమాన్యంలో వైద్య కళాశాలలను స్థాపించడమంటే చాలా ఇబ్బందులు ఉండేవని తెలంగాణ ప్రభుత్వం ప్రైవేటు కళాశాలల విషయంలో చాలా పారదర్శకంగా వ్యవహరిస్తుందన్నారు. రాజకీయ వేత్తగా పువ్వాడ నాగేశ్వరరావుకు రాష్ట్రంలో ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. 85 ఏళ్ల వయస్సులోనూ ఖమ్మం జిల్లా అభివృద్ధి పేదలు, గిరిజనుల అభ్యున్నతి గురించి ఆలోచన చేస్తున్నారంటే వారి పోరాట పటిమ అవగతమవుతుందన్నారు. అటువంటి వ్యక్తి నేతృత్వంలో మమత సంస్థలు కీర్తి ప్రతిష్టలు పొందడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్రం వైద్య విద్యకు హబ్ గా మారుతుందని 10 వేల ఎంబిబిఎస్ సీట్లతో విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించామన్నారు. ఒకప్పుడు ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లి వైద్య విద్యను అభ్యసించే వారని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఓపెన్ కేటగిరిలో తెలంగాణకు వచ్చి విద్యను అభ్యసిస్తున్నారని దేశంలో 43 శాతం సీట్లు తెలంగాణలోనే కల్పించడం జరిగిందని మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అన్ని కలిపి కేవలం 57 శాతం మాత్రమే వైద్య విద్యకు అవకాశం కల్పిస్తున్నాయని హరీష్ తెలిపారు. ముఖ్యమంత్రి కేసిఆర్ పారదర్శక విధానం ఈ ప్రగతికి కారణమన్నారు. 38 జిల్లాల్లో ప్రభుత్వ పరంగా వైద్య కళాశాలలను స్థాపించడం జరిగిందని ఖమ్మంలో ఈరోజే వైద్య కళాశాల భవనాలను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు.

ఎవరు తోడ్పాటు అందించారో మాకు తెలుసు : మంత్రి అజయ్‌మమత కళాశాలల స్థాపనకు, విస్తృతికి ఎవరు తోడ్పాటునందించారో ఎవరు కాలు అడ్డం పెట్టారో మాకు తెలుసునని మాకు సహకరించిన వారికి సర్వద కృతజ్ఞులమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. సభలో పువ్వాడ అజయ్ మాట్లాడుతూ 25 ఏళ్ల నాడు మమత కళాశాల స్థాపన కోసం ఢిల్లీ వెళితే మా వద్దకు రావద్దంటూ చెప్పిన వారే ఇప్పుడు మమత సంస్థల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. యునైటెడ్ ఫ్రంట్ పాలనలో నారా చంద్రబాబు నాయుడు ఆ తర్వాత వాజ్పేయి ప్రభుత్వంలో వెంకయ్య నాయుడు తమకు పూర్తిగా సహకరించారని రజకోత్సవ వేళ వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఆ తర్వాత 2లో..

## రానున్న ఎన్నికల్లో
# నోబెల్స్‌కు, గ్లోబల్స్‌కు పోటీ

– పనోళ్లు కావాలో, పగోళ్లు కావాలో ప్రజలే తేల్చుకోవాలి
– ఆర్‌టిసి బిల్లు ఆమోదం పొందడం శుభపరిణామం
– అన్ని రంగాల్లోనూ తెలంగాణ నెంబర్‌వన్
– త్వరలో ‘సీతారామా ప్రాజెక్టు పనులు పూర్తి



**రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో నోబెల్స్‌కు, గ్లోబల్స్‌కు మధ్య పోటీ ఉంటుందని వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యానించారు. పని చేసే నోబెల్స్ లాంటి బిఆర్ఎస్ కావాలో, గ్లోబల్ ప్రచారం చేసే కాంగ్రెస్ కావాలో ప్రజలు ఆలోచించు కోవాలన్నారు. ఖమ్మంలోని మంత్రి పువ్వాడ స్వగృహంలో గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి హరీష్‌రావు మాట్లాడారు.**

వివరాలు మెయిన్‌లో..

## ఇది ప్రజల జిల్లా, దొరల జిల్లా కాదు..

**ఇది కేసీఆర్ జాగీర్ కానే కాదు**

**సిద్దిపేట కాదు...రాజకీయ చైతన్యం కలిగిన జిల్లా**

**మంత్రి హరీష్‌రావు వ్యాఖ్యలపై సిఎల్‌పి నేత భట్టి ఫైర్**



**ఖమ్మం, సెప్టెంబర్ 14(మనం బ్యూరో) :** ఇది ఖమ్మం జిల్లా. ప్రజల జిల్లా. దొరల జిల్లా కాదు. హరీష్‌రావు, కేసీఆర్ జాగీర్ కానే కాదని సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మంలో హరీష్‌రావు నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. దీనికి భట్టి విక్రమాక్క కౌంటర్ ఇచ్చారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వెంకటాపురం లో గురువారం సాయంత్రం జరిగిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఇక్కడ ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్య రాష్ట్రం. ఇక్కడ ప్రజలను ఉద్దేశించి మిగతా రాజకీయ పార్టీల గురించి మాట్లాడటం సరైనది కాదు. ప్రతిసారి మాట్లాడితే 90 సీట్లు మావే అంటారు, తెలంగాణ ప్రజలు రేపు తీర్పు చెప్పబోతున్నారు. హరీష్ రావు ఇది సిద్దిపేట కాదు, ఖమ్మం రాజకీయంగా చైతన్యం కలిగిన జిల్లా అని వ్యాఖ్యానించారు. నువ్వు ప్రారంభోత్సవానికో, శంకుస్థాపనలకో వచ్చి పోతావ్, నీకేం తెలుసు ఇక్కడ రాజకీయం. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆసుపత్రిలో డాక్టర్లు, నర్సులు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చెయ్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీకు 2లో..

## మంత్రి కేటీఆర్ కి కృతజ్ఞతలు తెలిపిన వెంకట్రావు



**భద్రాచలం, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** హైదరాబాద్ ప్రగతిభవన్ లో తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐటీ పురపాలక శాఖ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావును భద్రాచలం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు టికెట్ ఇచ్చినందుకు నియోజకవర్గ ప్రజల తరపున మంత్రి కేటీఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## ఒంటరి మహిళలకు చేయూత



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక గ్రామ పంచాయతీ లో గల ఐటీసీ బంగారు భవిష్యత్ బంధన్ సంస్థ ఆధ్వర్యంలో ఒంటరి మహిళలకు స్వంతంగా చిరు వ్యాపారం చేసుకునే విధంగా 25 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 8400 చొప్పున రెడీమేడ్ బట్టల దుకాణం, కిరాణా సామానులు, లాండ్రి షాప్ పరికరాలు, ఫ్యాన్స్ ఐటమ్స్, వెజిటేబుల్స్, పండ్లు, చికెన్ షాప్, ఫుట్వేర్, డ్రైఫిష్, కుట్టు మిషన్లు సహాయం అందించారు. బంధన్ ప్రోగ్రాం ఆఫీసర్ దీపక్ మాట్లాడుతూ ఒంటరి మహిళల అభివృద్ధికిమా సంస్థ సహాయ సహకారాలు అందిస్తుందని వారు తెలియజేశారు. 25 మంది లబ్ధిదారులకు 2,10,000 రూపాయలు లబ్ధి పొందారు. ఒంటరి మహిళలు ఆర్థికంగా సామాజికంగా వారు ఎదగాలని మేము కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిసి ఎమ్మెస్ కే పి ఓ సుచిత్ర,బంధన్ ప్రోగ్రాం ఆఫీసర్ దీపక్, బంధన్ ఏరియా కోఆర్డినేటర్ ఉత్తం మరిజిత్, బంధన్టిఎల్ నాగరాజు, ఇరవెండి సర్పంచ్ కొరస లక్ష్మి, కోయగూడెం సర్పంచ్ తుపాకుల రామలక్ష్మి, సిబ్బంది శరత్, నాగేంద్రబాబు,ప్రవీణ్ కుమార్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాలి..

### –తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి చెర్పసత్యం



**కరకగూడెం, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ తక్షణమే నిర్మించాలని మండల కేంద్రంలో పాత బ్యాంకు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని అందుకు కేటాయించాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి చరప సత్యం డిమాండ్ చేశారు మండలం దిన దిన అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఆర్టీసీ బస్టాండ్ లేకపోతే దారుణమని ఇప్పటికే అనేకసార్లు నిర్మించాలని ఆందోళన చేసినప్పటికీ నిర్మిస్తామని చెబుతున్నారే తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదని అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలన్నీ ఆక్రమణలకు గురవుతున్నాయని వారు మండిపడ్డారు తక్షణమే పాత బ్యాంకు సమీపంలో గల ప్రభుత్వ భూమిని ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి కేటాయించాలని అధికారులను డిమాండ్ చేశారు ఇప్పటికే అట్టి భూమి కబ్జాల పర్వం లోకి వెళ్లినట్టుగా అనుమానం కలుగుతావుందని దీనిపై త్వరలోనే జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేసి బస్టాండ్ నిర్మాణానికి కేటాయించాలని సంబంధిత అధికారులను కోరారు

## అంగన్వాడీలకు కనీస వేతనం 26,000 ఇవ్వాలి



**కరకగూడెం, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో ఐదేళ్లు పనిచేసే ఎమ్మెల్యేలకు నెలకు రెండు లక్షల జీతం మాజీ ఎమ్మెల్యేలకు 70000 పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు కనీస వేతనం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఎందుకు ఇవ్వడం లేదని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కొమరం కాంతారావు ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో చివరి నెల జీతం లో సగం జీతం పెన్షన్ గా పొందే హక్కు అంగన్వాడీలకు ఉందని సుప్రీంకోర్టు తీర్పు చెబుతుందని దీన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చట్టాన్ని అమలు చేయాలని అంగన్వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి సమ్మె చేస్తున్న సంఘాలతో సమస్యలపై చర్చలు జరపాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టు టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వంగర సతీష్ పాల్గొన్నారు.

# సంఘర్షణ కాదు సామరస్యం మేలు

### లాభంతో కాదు సేవా భావంతో మమత సంస్థల నిర్వహణ

### వ్యవస్థాపక అధ్యక్షులు పువ్వాడ



**ఖమ్మం, సెప్టెంబర్ 14(మనం బ్యూరో):** సంఘర్షణ విధానాన్ని మానుకోని సామరస్యంతో మెలిగినప్పుడే సమాజంలో శాంతి నెలకొనడంతో పాటు త్వరితగతిన అభివృద్ధి జరుగుతుందని మమత వైద్య, విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ శాసన సభ, శాసన మండలి సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మమత వైద్య విద్యా సంస్థల రజతోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మమత సంస్థలు ప్రజా సంస్థలని, ప్రజల సంస్థలని అనేక ఒడుదొడుకులు ఎదురైనా ప్రజల తోడ్పాటుతో నిలబెట్టగలిగామన్నారు. లాభం కోసం సంస్థలను ఏర్పాటు చేయడం కానీ, నిర్వహించడం కానీ జరగడం లేదని కేవలం సేవాభావంతోనే సంస్థలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. సంస్థ ఏర్పాటైన కొద్ది కాలానికే అనేక మంది వైద్య విద్యా సంస్థలను నిర్వహించడం సాధ్యం కాదు తప్పుకోండి అని సూచించారని అయినా అనేక మంది తమకు దన్నుగా నిలిచారని ఈ సందర్భంగా వారితో పాటు మమత సంస్థల డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. దివంగత పెద్దలు చేకూరి కాశయ్య, ఉడతనేని సత్యం లాంటి వ్యక్తులు అనేక సూచనలు చేశారన్నారు. 25 ఏళ్ల సుదీర్ఘ కాలంలో సంస్థ అనేక విషయాలలో విజయాలు సాధించడమే కాకుండా పురోభివృద్ధి సాధించి ఒక చారిత్రాత్మక సంస్థగా నిలిచిందని పువ్వాడ తెలిపారు. సామాన్యులకు వైద్యం అందుబాటులోకి తేవాలనే ఏకైక లక్ష్యమే మమత వైద్య సంస్థలకు కారణమన్నారు. కొందరు తామేదో సహకరించినట్లు అభూత కల్పనలతో ప్రచారం చేసుకుంటున్నారని అందులో నిజం లేదన్నారు. ప్రతి యేటా వందలాది మంది ప్రతిభతో కూడిన వైద్యులను అందించడమే గాక ప్రతి రోజు 1000 మంది రోగులకు వైద్య సాయం అందిస్తున్నామని పువ్వాడ తెలిపారు. జిల్లా అభివృద్ధికి అనేక మంది ప్రజాప్రతినిధులుగా, రాజకీయ నాయకులుగా తోడ్పాటునందించారని ఇదే సమయంలో ఇంకా గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, పేదలకు మరిన్ని సౌకర్యాలు సమకూర్చాల్సి ఉందని ఆ దిశగా ఆలోచన చేయాలని పువ్వాడ సూచించారు. తన 85వ పుట్టిన రోజు సందర్భంగా పువ్వాడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్ను కట్ చేశారు. ఈ సభలో రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్, మమత సంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ, మమత సంస్థల డైరెక్టర్లు పువ్వాడ విజయలక్ష్మి, పువ్వాడ వసంతలక్ష్మి, నరేన్, నయన్ రాజ్, జిల్లాకు చెందిన పార్లమెంటు సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పువ్వాడకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సిపిఐ నేతలు

**ఖమ్మం, సెప్టెంబర్ 14(మనం న్యూస్):** సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ శాసన సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావుకు పలువురు సిపిఐ నేతలు గురువారం ఆయన ఇంటి వద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పువ్వాడ నాగేశ్వరరావు ఆయన సతీమణి పువ్వాడ విజయలక్ష్మి కి ఈ సందర్భంగా వైవాహిక జీవిత శుభాకాంక్షలు తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన సున్వాడ 85వ జన్మదినోత్సవం జరుపుకోవడం అత్యంత సంతోషకరమన్నారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించి ప్రజా ఉద్యమాలకు దన్నుగా నిలవాలని ఆకాంక్షించారు. పువ్వాడకు ప్రత్యేక అభినందనలు తెలిపిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, ఎకె జానిమియా, కొండపర్తి గోవించరావు, కార్పొరేటర్లు బిజి క్లెమెంట్, చామకూరి వెంకటనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు, జిల్లా సమితి సభ్యులు, మండల కార్యదర్శులు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఖమ్మం పట్టణలకు చెందిన పలువురు పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఐఎంఏ అధ్యక్షులు బాగం కిషన్ రావుతో పాటు పలువురు వైద్యులు, వివిధ శాఖల అధికారులు, పువ్వాడ సహచరులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## కెసిఆర్ సారథ్యంలో పారదర్శక పాలన

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మమత సంస్థల విస్తృతికి ముఖ్యంగా 2018లో హైదరాబాద్లోని బాచ్పల్లిలో మమత కళాశాలను స్థాపించడానికి ముఖ్యమంత్రి కేసిఆర్ తోడ్పాటు మరువలేనిదన్నారు. ఆయనే కళాశాల ఏర్పాటుతో పాటు ప్రదేశం కూడా చూపించారని అజయ్ కుమార్ తెలిపారు. ఇప్పుడు బాచ్పల్లి కళాశాల కూడా పిజి కోర్సులను నిర్వహిస్తుందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి మమత సంస్థలు దోహదపడ్డాయన్నారు. ఇదే సందర్భంలో చంద్రబాబు అరెస్టును మంత్రి అజయ కుమార్ తీవ్రంగా ఖండించారు. గవర్నర్ అనుమతి లేకుండా చంద్రబాబును అరెస్టు చేయడం కక్ష సాధింపే అన్నారు. విచారణ జరపవచ్చు కానీ ఇది పద్దతి కాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ముఖ్యంగా ముఖ్యమంత్రిపై అవాక్కులు చేవాక్కులు పేలిన ఏ ఒక్కరి పైన కక్షసాధింపుగా వ్యవహరించ లేదని పువ్వాడ గుర్తు చేశారు. ప్రజల ఆదరాభిమానాలతో మమత కళాశాలలను మరింత అభివృద్ధి పరుస్తామని ఆయన తెలిపారు. ఖమ్మం ఎంపి నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ పువ్వాడ నాగేశ్వరరావు దురదృష్టి సంస్థలు ఈ స్థాయికి 1/2ఎదిగేందుకు కారణమని ఆయన తెలిపారు. మూడవ తరం కూడా మమత సంస్థల బాధ్యతలను నిర్వర్తించడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో తెలంగాణ నుంచి తయారయ్యే వైద్యులు రాష్ట్రాన్నే కాదు దేశాన్ని కూడా కాపాడనున్నారని నామ తెలిపారు. ఈ సభలో మమత సంస్థల డైరెక్టర్లు పువ్వాడ విజయలక్ష్మి. పువ్వాడ వసంతలక్ష్మి, పువ్వాడ నరేన్, నయన్ రాజ్, ఎంపిలు వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథి రెడ్డి, ఎంఎల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, తాతా మధు, ఎంఎల్ఏ లు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియా నాయక్, మెచ్చా నాగేశ్వరరావు, విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, జెడ్పీ ఛైర్మన్ లింగాల కమల్రాజు, మేయర్ పునుకొల్లు నీరజ, నుడా ఛైర్మన్ బచ్చు విజయకుమార్, డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మెన్లు కూరాకుల నాగభూషణం, రాయల వెంకట శేషగిరి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇది ప్రజల జిల్లా....

**(మొదటి పేజీ తరువాయి)**

ఇచ్చిన ఉద్యోగాన్ని సరిగ్గా చెయ్.. ఇష్టం వచ్చినట్లు మాట్లాడకు....ఖమ్మం రాజకీయం గురించి నీకెందుకు ఇక్కడ ఒక సీటు లేదు నీతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటి అద్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ , పి సి సి సభ్యులు రాయల నాగేశ్వరరావు, బుల్లెట్ బాబు, ముదిగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

# యస్.బి.ఐ.టి. లో ప్రారంభమైన ప్రతిష్టాత్మక లింక్ఇన్ ట్రైనింగ్ ప్రోగ్రాం

**ఖమ్మం, సెప్టెంబర్ 14(మనం న్యూస్) :** స్థానిక యస్.బి.ఐ.టి. ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్. విద్యార్థులకు ఎంతో ప్రతిష్టాత్మకమైన లింక్డ్ఇన్ ట్రైనింగ్ ప్రోగ్రాం ప్రారంభమైనదని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాం రాబోయే 5 రోజుల పాటు జరుగుతుందని, ఈ ప్రోగ్రాం ద్వారా అన్ని బ్రాంచీల విద్యార్థులకు తమ కెరియర్ను ఎలా మలచుకోవాలో కావలసిన నైపుణ్యాలు, విధి, విధానాలు, తమ ప్రొఫైల్ను ఎలా మెరుగు పరుచుకొని తమకు ఇష్టమైన రంగాలలో ముందుకు సాగాలో మొదలగు అంశాల గురించి తోడ్పాటును అందించనుందని అన్నారు. విద్యార్థులు ఈ శిక్షణను పూర్తిగా సద్వినియోగం చేసుకొని అత్యధిక ప్లేస్మెంట్స్ సాధించాలని





ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి వర్క్ షాపులను పలు కంపెనీలతో నిర్వహించేలా యాజమాన్యం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం ఫేస్ ప్ సంస్థ ప్రతినిధులు ఉషాసక్కుబాయి మరియు భానుప్రియ లింక్ఇన్ ను ఎలా ఉపయోగించాలనే అంశంపై క్లుప్తంగా విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా జి.ధాత్రి, ప్రిన్సిపల్ డా జి. రాజ్కుమార్, వైస్ ప్రిన్సిపల్ డా అమిత్ బింధాజ్, ఎకడమిక్ డైరెక్టర్స్ గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్, డా జె. రవీంద్రబాబు, డా యస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### మానవ వనరుల కొరత తీర్చేందుకు

# వైద్య, నర్సింగ్ కళాశాలల ఏర్పాటు

### ...వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి హరీష్‌రావు ... మద్దులపల్లిలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన

**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 14(మనం న్యూస్) :** వైద్య, ఆరోగ్య రంగంలో మానవ వనరుల కొరత తీర్చాలని ఉద్దేశ్యంతో ప్రభుత్వం జిల్లాల్లో ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలల ఏర్పాటు చేస్తున్నదని రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖల మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. గురువారం ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లి గ్రామంలో నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య మంత్రి మాట్లాడుతూ, 5 ఎకరాల్లో రూ. 25 కోట్లతో నర్సింగ్ కళాశాల, హాస్టల్ భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు, ఒక్క సంవత్సరం లోనే పూర్తిచేసి అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. స్టాఫ్ నర్సులు అంటే ఆసుపత్రుల్లో ఎక్కువగా కేరళ రాష్ట్రం నుండే ఉండేవారని, రాష్ట్రంలో కావాల్సిన మెడికల్, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది వుండే వారు కారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇది గ్రహించి, ప్రతి జిల్లాలో మెడికల్, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటుచేసిందని ఆయన అన్నారు. త్వరలో జిల్లాలో బిఎస్సి పారా మెడికల్ కళాశాల మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం సీఎం కలల ప్రాజెక్ట్ అని, ఇది పూర్తయితే కాలంతో పనిలేకుండా, సాగర్ లో నీళ్లు రాకపోయినా 2 పంటలకు సాగునీరు అందుతుందని ఆయన అన్నారు. పాలేరు నియోజకవర్గానికి రూ. 125 కోట్ల ఎస్డిఎఫ్ నిధులు మంజూరు అయినట్లు, అట్టి నిధులతో గ్రామ గ్రామానికి సిసి రోడ్స్, కమ్యూనిటీ హాళ్లు, అంగన్వాడీ భవనాలు నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో డాక్టర్లు, నర్సుల కొరత ఉన్నట్లు, శిక్షణా నర్సులు చాలా తక్కువ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మేల్ నర్సింగ్ చేపట్టి, ప్రతి వైద్య కళాశాల కు అనుబంధంగా నర్సింగ్ కళాశాల ఏర్పాటుచేదినట్లు ఆయన అన్నారు. పారా మెడికల్ కోర్సులు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంటే, తక్కువ ఫీజుతో అవకాశాలు వుంటాయని, పేదవాళ్లకు విద్య అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. నర్సింగ్, ఫిషరీస్, ఇంజనీరింగ్ కళాశాలలతో ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.



**తెలంగాణ ఏర్పాటుతో విద్యాభివృద్ధి : కందాళ**

పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో విద్యకు సంబంధించి ఎంతో అభివృద్ధి జరిగిందని అన్నారు. ఆనాడు చదువుకునే పరిస్థితి కాక చదువు కొనే పరిస్థితి ఉండేదని, నేడు పరిస్థితి మారిందని తెలిపారు. అంగన్వాడీ నుండి ఉన్నత చదువులు అన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. డబ్బు ఎక్కువ ఉందని చదువు ఆపొద్దని, డబ్బు లేదని చదువు ఆపొద్దని ఆయన తెలిపారు. ప్రతి పిల్లవాడు చదువుకునేలా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఫిషరీస్, నర్సింగ్, ఇంజనీరింగ్ కళాశాలలతో నియోజకవర్గం విద్యారంగంలో మరింత ముందుకు వెళుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర రెడ్డి, తాతా మధుసూదన్, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్, జెడ్పి చైర్మన్ లింగాల కమలరాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. మాలతి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రత్న కుమారి, ఖమ్మం రూరల్ ఎంపిపి బెల్లం ఉమ, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీచైతన్య ఒలంపియాడ్ స్కూల్‌లో హిందీ భాషదినోత్సవ వేడుకలు

**ఖమ్మం, సెప్టెంబర్ 14(మనం న్యూస్) :** స్థానిక మమత ఆసుపత్రి రోడ్‌లోని శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాల నందు ఘనంగా హిందీ భాషాదినొత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ శ్రీమల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ హిందీ ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం ఉన్న భాష అని, హిందీని అందరు తప్పకుండా నేర్చుకోవాలని ప్రసంగించారు. పాఠశాల డైరెక్టర్ శ్రీమతి శ్రీవిద్య మాట్లాడుతూ ఇంజనీరింగ్, మెడికల్, ఇతర ఉన్నత విద్యాభ్యాసం కోసం ఇతర రాష్ట్రాలకు వేల్లే విద్యార్థులకు హిందీ భాషా జ్ఞానం తప్పని సరి అని అన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వాస్య రచన, వకృత్వ పోటీలు నిర్వహించి బహుమతి అందచేశారు. కొందరు విద్యార్థులు వివిద వేషదారణతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. జయప్రకాష్, పాఠశాల ప్రిన్సిపాల్స్ టిఎల్ఎన్.శర్మ, రాజ్‌కుమార్ జోషి, ఏడుకోండలు, వైస్‌ప్రిన్సిపాల్స్ రామాకృష్ణరెడ్డి, సురేష్, డీన్స్, కె.వి.ఆర్, రాజశేఖర రెడ్డి, నవీన్, రామారావు, లక్ష్మీనరసింహ, నరేష్,



ప్రైమరీ ఇన్‌చార్జ్ హిమబిందు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో హిందీ దివస్ వేడుకలు



**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 14(మనం న్యూస్) :** నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లా యువ అధికారి అన్వేష్ చింతల ఆదేశాల మేరకు, అకౌంటెంట్ భానుచందర్ ప్రోత్సాహంతో, హిందీ దివస్ వేడుకలను రూరల్ మండలంలోని న్యూ శ్లోక స్కూల్లో నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్ గాదే మనస్విని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యూ శ్లోక స్కూల్ ప్రిన్సిపాల్ కె. సదన్, కరస్పాండెంట్ నవీన్ కుమార్, ఇంచార్జ్ మంజులా రెడ్డి, హయ్యర్ హిందీ టీచర్ ఎస్.కె. అమీర్, లోయర్ హిందీ టీచర్ కవిత పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు హిందీ దివస్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వక్తృత్వ డ్రాయింగ్ పోటీలను నిర్వహించిన గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని తమ పాఠశాలలో నిర్వహించినందుకు పాఠశాల యాజమాన్యం నెహ్రూ యువ కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపింది.

## ప్రాణం ఉన్నంతవరకు పొంగులేటి శీనన్న తోనే..

### 27వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డా నగేష్ యాదవ్



**ఖమ్మం, సెప్టెంబర్ 14జ(మనం న్యూస్) :** ఇటీవలే కొన్ని వార్త పత్రికల్లో తనపై రాసిన వార్తలలో వాస్తవం లేదని దానికి తనకు ఎటువంటి సంబంధం లేదని వాస్తవానికి తనకు బీజేపీ పార్టీలో సభ్యత్వం లేదని , ఆ పార్టీకి తనకు ఎటువంటి సంబంధం లేదని దీనిని తీవ్రంగా 27వ డివిజన్ స్వతంత్ర కార్పొరేటర్ దొడ్డా నగేష్ యాదవ్ ఖండించారు . పొంగులేటి శీనన్న దగ్గర తనకున్న మంచి పేరును మరియు డివిజన్లో తనకున్న మంచి గుర్తింపును పోగొట్టి తన పై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు . కావున పొంగులేటి శీనన్న అభిమానులు , నాయకులు , ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు గమనించాలని కోరారు తను కాంగ్రెస్ పార్టీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రధాన ముఖ్య అనుచరుణ్ణి . నా ప్రాణం ఉన్నంతవరకు , నా కట్టె కాలేంతవరకు పొంగులేటి శీనన్నతోనే ఉంటానని , ఖమ్మం ఎమ్మెల్యేగా పొంగులేటి శీనన్న పోటీ చేయాలని చెప్పేవాణ్ని మరియు కోరుకునేవాన్ని అలాంటిది నేను బీజేపి ఎమ్మెల్యేగా అభ్యర్థిగా ఎందుకు అప్లికేషన్ పంపిస్తానని అన్నారు .

## రెజొనెన్స్ ఇన్ఫో పాఠశాలలో హింది దివస్ వేడుకలు



**ఖమ్మం, సెప్టెంబర్ 14(మనం న్యూస్) :** ఖమ్మం నగరంలో గల వి.డి.వోస్ కాలనీ లోని రెజొనెన్స్ ఇన్ఫో పాఠశాలలో గురువారం హిందీ దివస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఆర్.వి నాగేంద్రకుమార్ మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతస్వాతంత్ర్య ఉద్యమ కాలంలో హిందీ భాషాభివృద్ధికి గాంధీ చేసిన కృషిని కొనియాడారు. జాతీయ భాషమీద పట్టుసాధించి మంచిగా నేర్చకొని హిందీలో మాట్లాడటం అనేది చాలా అవసరమని వివరించారు. పాఠశాల డైరెక్టర్లు నీలిమా, కె.శ్రీధర్ రావు మాట్లాడుతూ హిందీ గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ టి గోపాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలందరికీ పక్కా గృహాలు

– వైరా నియోజకవర్గ నాయకురాలు బానోతు విజయబాయి – లచ్చగూడెంలో వాడ వాడకు విజయబాయి



**ఏన్కూరు, సెప్టెంబర్ 14(మనం న్యూస్):** రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి రాగానే పేదలందరికీ పక్కా గృహాలు నిర్మిస్తామని ఆ పార్టీ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోతు విజయబాయి తెలిపారు. గురువారం మండల పరిధిలోని లచ్చగూడెం, కోదండరాంపురం గ్రామాల్లో వాడ వాడకు విజయబాయి కార్యక్రమంలో భాగంగా మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో విజయబాయి గడప గడపకి తిరుగుతూ.. ఎన్నికల ప్రచారం చేశారు. వారి ప్రధాన సమస్యలైనా.. పక్క ఇళ్ళు, సిసి రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు వంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 100 రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని, వచ్చిన వెంటనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కాంగ్రెస్ పార్టీ పథకాలను వివరించారు. రూ.15 వేల రైతుబంధు, ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, రూ.4 వేల పింఛన్, రూ.500లకే వంట గ్యాస్ వంటి పథకాలను గ్యారెంటీ కార్డు ఇచ్చి మరి అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ముక్తి వెంకటేశ్వర్లు, నల్లమల్ల శివకుమార్, స్వర్ణ ప్రహ్లాదరావు, గిద్దగిరి సత్యనారాయణ, వాసిరెడ్డి నాగేశ్వరరావు, గుగులోత్ శోభన్ నాయక్, గుగులోత్ రఘు, బానోత్ శ్రీనివాసరావు, గుగులోత్ శ్రీను, బానోత్ నరసింహ, బాధావత్ బన్సీలాల్, బోడ నరసింహారావు, అశోక్ రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థపై పర్యవేక్షణ లేని ఎంఇఓ

– సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్

**ఏన్కూరు, సెప్టెంబర్ 14(మనం న్యూస్):** మండల విద్యావ్యవస్థ పర్యవేక్షణలో మండల విద్యాశాఖాధికారి పూర్తిగా వైఫల్యం చెందాడని సీపీఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని, ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి అని, వారి మీద అజమాయిషీ కరువైందన్నారు. ఏజెన్సీ అలవెన్సులు పొందుతూ ఎక్కడో ఖమ్మం, కొత్తగూడెం నుండి వస్తున్నారన్నారు. చాలా మంది ఉపాధ్యాయులు ఖమ్మంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, వారితో పాటు ఎంఈఓ కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, అనేక మంది ఉపాధ్యాయులతో కలిసి నెట్ వర్క్ మార్కెట్ వ్యాపారంలో లక్షల్లో పెట్టుబడి పెట్టించి, అనేక కేసుల్లో కోర్టుకు తిరగడంలో బిజీగా ఉన్న విద్యాశాఖాధికారి తన విధి నిర్వహణలో పూర్తిగా వైఫల్యం చెందాడని ఆరోపించారు. విద్యాశాఖాధికారి ఒక అవినీతి అధికారి అని, ఆయనపై పూర్తిగా విచారణ చేస్తే అన్ని విషయాలు బయటకొస్తాయన్నారు. మనఊరు–మనబడిలో భాగంగా పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులతో కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేస్తుంటే పర్యవేక్షించాల్సిన పాఠశాలల హెచ్ఎంలు, ఏఈ, ఎంఈఓ పటించుకునే పరిస్థితి లేదన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించాలన్నారు.



# అక్రమ అరెస్టులతో పోరాటాలు ఆపలేరు

..పివైఎల్ జిల్లా కార్యదర్శి గౌరెపాటి రమేష్

**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** ఆరోగ్య శాఖ మంత్రి ఖమ్మం జిల్లాలో పర్యటన సందర్భంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వామపక్షాల విద్యార్థి యువజన సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అరెస్టు చేసిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) ఖమ్మం జిల్లా కార్యదర్శి మస్తాన్ మరియు ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) రాష్ట్ర కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ లను తక్షణమే విడుదల చేయాలని ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) ఖమ్మం జిల్లా కార్యదర్శి గౌరెపాటి రమేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5,135 కోట్ల రూపాయల స్కాలర్షిప్, ఫీ – రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఖమ్మం జిల్లాకు మంజూరు అయిన మెడికల్ కళాశాల భవనాన్ని నూతనంగా నిర్మించాలి, భద్రత ప్రమాణాలు పాటించాలి అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలకు, కళాశాలలకు నూతన భవనాలు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న ఏఎన్ఎం, జిఎన్ఎమ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. తక్షణమే అరెస్టు చేసిన వారిని ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.




# ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైన తిరుమలాయపాలెం

... సర్పంచ్ కొండబాల వెంకటేశ్వర్ల ను అభినందించిన కలెక్టర్

**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 14 (మనం న్యూస్) :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ పథకంలో పారిశుద్ధం, శానిటేషన్, ఘన వ్యర్థాలు, కంపోస్టింగ్, భాగంలో కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అవార్డుల పంట పండిస్తుంది. ఖమ్మం జిల్లా పాలేరు డివిజన్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి ఆశీస్సులతో తిరుమలాయపాలెం మండలంలోని ,తిరుమలాయపాలెం గ్రామానికి బెస్ట్ గ్రామపంచాయతీ గా ఎన్నికైనందుకు, ఖమ్మం జిల్లా కలెక్టర్ గౌతమ్ చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ కొండ బాల వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రెటరీ సునీత అవార్డులు, ప్రశంస పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



## బిఆర్ఎస్‌లోకి ఎర్రుపాలెం జడ్పిటిసి

–మంత్రి హరీష్ రావు సమక్షంలో పార్టీలో చేరిక



**ఎర్రుపాలెం, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** ఎర్రుపాలెం మండల జడ్పిటిసి శీలం కవిత తిరిగి బిఆర్ఎస్ పార్టీలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు సమక్షంలో గురువారం చేరారు. మాజీ ఎంపీ ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిటీ కోకన్వీనర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అనుచరులలో ఒకరైన ఈమె ఇటీవలకాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ పార్టీలో నెలకొన్న గ్రూపు ల ఆసమన్వయంతో ఇమడలేక జిల్లా రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ నామ నాగేశ్వరావు ఎమ్మెల్సీ తాతా మధు, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు , రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ కొండ బాల కోటేశ్వరరావు ,చావ రామకృష్ణ, జిల్లా నాయకులు శీలం వెంకటరెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో జడ్పిటిసి చేరారు. ఈ సందర్భంగా మండలంలో జడ్పిటిసి సభ్యురాలుగా తనకు గతంలో అభివృద్ధి పనుల కేటాయింపులో జరిగిన లోపాలను మంత్రి దృష్టికి ఆమె తీసుకువెళ్లారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా ప్రజా ప్రతినిధుల సమక్షంలో మంత్రి హరీష్ రావుకి అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పంబి సాంబశివరావు, ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, భీమవరం గ్రామ శాఖ అధ్యక్షులు చిన్న బాబు, మురళి. మాజీ సర్పంచ్ బహదూర్ పాల్గొన్నారు.

## జీవి అకాడమీ (మిలీనియం) లో ఘనంగా హిందీ దివాస్



**మధిర, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** మధిర పట్టణంలోని జీవి అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మిలీనియం పాఠశాలలో సెక్రెటరీ, కరస్పాండెంట్ గోపీచంద్ నేతృత్వంలో గురువారం హిందీ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో హిందీ దివాస్ ప్రత్యేకతను చాటుతూ విద్యార్థినీ విద్యార్థులు ప్రత్యేక ప్రాజెక్టు వర్కులని రూపొందించారు.అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు హిందీ దివాస్ వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, ఇన్చార్జ్ రాజేశ్వరి, ఎండి సుల్తానా, షేక్ హుస్సేన్ బి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ విజయభేరిని విజయవంతం చేద్దాం

**కల్లూరు, సెప్టెంబర్ 12(మనం న్యూస్):** సెప్టెంబర్ 17న హైదరాబాద్ నగర శివారులోని తుక్కుగూడ గ్రామం రాజీవ్ గాంధీ ప్రాంగణంలో జరగబోవు విజయభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని టిపిసిసి ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అనుచరుడు కొండూరు సుధాకర్ కోరారు. ఈ సభకి కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ తో పాటు తెలంగాణ రాష్ట్ర ఇతర రాష్ట్రాల ముఖ్య నేతలు హాజరగు నేపథ్యంలో చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతం చేయుటకు నియోజకవర్గంలోని ప్రతి మండలం నుండి భారీగా కాంగ్రెస్ శ్రేణులు కార్యకర్తలను తరలించాలని అందుకు అందరూ కృషి చేయాలని కోరారు.

# రెజొనెన్స్ శ్రీనగర్‌లో ''జాతీయ హిందీ భాషా దినోత్సవ వేడుకలు''

**ఖమ్మం, సెప్టెంబర్ 14(మనం న్యూస్) :** ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ స్కూల్‌లో గురువారం జాతీయ హిందీ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14న జాతీయ హిందీ భాషా దినోత్సవంగా జరుపుకుంటామని, భారత స్వాతంత్ర్యోద్యమములో అఖిల భారతాన్ని చైతన్యం చేసి ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాషా ఆనాడు దోహదపడిందని అన్నారు. దేశంలో ఎక్కడ జీవించాలన్న హిందీ భాష మనకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. హిందీ సాహిత్యంలో విశేషమైన రచనలు చేసిన మహనీయులను స్మరించుకుంటూ అందరికి హిందీ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. డైరక్టర్ గౌ॥ కొండా కృష్ణవేణి పాల్గొని మాట్లాడుతూ హిందీ భాష దేశభాషలలో అతిపురాతనమైన సుందరమైన భాష అని అన్నారు. అనంతరం విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యం.ప్రసన్నరావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.




# జె.వి.యర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా హిందీ దినోత్సవం

**సత్తుపల్లి, సెప్టెంబర్ 14(మనం న్యూస్) :** స్థానిక జె.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో హిందీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వీరన్న ప్రసంగిస్తూ మన జాతీయ భాష(నేషనల్ ల్యాంగ్వేజ్)గా పేరుగాంచిన 'హిందీ' భాషకు సెప్టెంబర్ 14న ఓ ప్రత్యేకత ఉందని, 'హిందీ దివస్' (హిందీ దినోత్సవం)గా జరుపుకుంటారని తెలిపారు. ప్రపంచంలో ఎక్కువ మంది మాట్లాడే భాషలో హిందీ ఒకటని తెలిపారు. అకాడమిక్ కోఆర్డినేటర్ రాంబాబు మాట్లాడుతూహిందీ భాష యూనిటీ ఆఫ్ లాంగ్వేజ్ అని అర్థశాస్త్ర విభాగ అధ్యక్షులు వినోద్ కుమార్ మాట్లాడుతూ హిందీ భాషా స్వతంత్ర ఉద్యమ కాలంలో ప్రజలందరినీ ఒకే తాటిపై నడిపించిందని వివరించారు. కార్యక్రమం లో హిందీ విభాగ అధిపతి కె .మధు మాట్లాడుతూ హిందీ భాష ఉత్తర , భారతాలను కలుపు వరద లాంటిదన్నారు. హిందీ భాష ప్రాముఖ్యత తెలుసుకొని భాషా పరిజ్ఞానం పెంపొందించుకోవాలని కోరారు. విద్యార్థులు చేత సాంస్కృతిక వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బంగారి, సారంగపాణి, ఫీర్ సాహేబ్ శ్రీనివాస సరిన్, చెన్నారావు, మాధవి, విజయలక్ష్మి, రాజ్యలక్ష్మి, రవికుమార్, ఆంజనేయులు, రాజకుమర్,తోట శ్రీశాంత్, విద్యార్థులు హాజరయ్యారు



# గ్రంథాలయ పనులను పరిశీలించిన ఎంపీ, ఎంఎల్ఏ

**సత్తుపల్లి :** పట్టణంలో బస్టాండ్ సెంటర్ నందు నూతనంగా చేపట్టిన గ్రంథాలయ పనులను ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారధితో కలిసి సందర్శించారు. పనులు జరుగుతున్న తీరును పరిశీలించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా బండి పార్థసారధి రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ మొదటి వారం కల్లా పూర్తి చేసి ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని రాబోయే వంద సంవత్సరాల వరకు ఉపయోగించుకునే అత్యంత ఆధునిక టెక్నాలజీతో నూతన అంగులతో నిర్మించిన లైబ్రరీ జిల్లాలోనే మొట్టమొదటిది మన సత్తుపల్లి లైబ్రరీ అవుతుందన్నారు. ఇక్కడ నుంచే ప్రపంచ నలుమూలలు చూసిన అనుభూతి కల్పించ వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ కూసం పూడి మహేష్, ఆత్మ కమిటీ చైర్మన్ వనమా వాసు, డిసిసిబి డైరెక్టర్ చల్లగుళ్ళ కృష్ణయ్య, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, గోగులముడి బాలాజీ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు అనీలు రఘు ,ప్రసాద్, నరసింహారావు అప్పారావు, అంకం రాజు, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు....



## అంగన్వాడి ఉద్యోగులు సిడిపిఓ కార్యాలయం ముట్టడి



**మధిర, సెప్టెంబర్ 14(మనం న్యూస్):** అంగన్వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సిఐటియు, ఎఐటియుసి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా 4వ రోజైన గురువారం మధిర అంగన్వాడి ప్రాజెక్టు నందు వైరా, బోనకల్లు, మధిర, ఎర్రుపాలెం అంగన్వాడీ ఉద్యోగులు సిడిపిఓ కార్యాలయం ముట్టడించారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న మధిర టౌన్ ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకొని ఉద్యోగులతో మాట్లాడి శాంతియుతంగా చర్చించుకొని సమస్యను పరిష్కరించుకోవాలని తెలియజేశారు.

# ఏన్కూరులో బీజేపీ నిరసన

**ఏన్కూరు, సెప్టెంబర్ 14(మనం న్యూస్):** కేంద్రమంత్రి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ కిషన్ రెడ్డి దీక్షను భగ్నం చేసి అక్రమంగా అరెస్టు చేయడానికి బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం తీవ్రంగా ఖండించారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కిషన్ రెడ్డి దీక్ష చేస్తుంటే పోలీసులు ఆ దీక్షను భగ్నం చేశారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని ఇందిరానగర్ లో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల కండువాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు నల్లబోతుల రమేష్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని అరెస్టులు చేసిన రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని అన్నారు. బిఆర్ఎస్ కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల దళిత మోర్చా రెంటపల్లి నారాయణ, ఉపాధ్యక్షుడుమోరబోయిన కృష్ణ, వజీనేపల్లి దర్గయ్య, నాగేశ్వరరావు, శీను తదితరులు పాల్గొన్నారు.



## భారతీయ గోర్ బంజారా పోరాట సమితి మండల అధ్యక్షుడిగా బాలాజీ



**ఏన్కూరు, సెప్టెంబర్ 14(మనం న్యూస్):** భారతీయ గోర్ బంజారా పోరాట సమితి మండల అధ్యక్షుడిగా ఏన్కూరుకు చెందిన మూడు బాలాజీను నియమించారు. గురువారం మండల కేంద్రంలో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రవి చందర్ చౌహాన్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడిగా మూడు బాలాజీ నాయక్, ఉపాధ్యక్షుడిగా రమేష్ నాయక్ ను ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ బానోత్ దుర్గాప్రసాద్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ మండలంలో బంజారాల సమస్యల పరిష్కారానికై పోరాడుతానని తెలిపారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన సంఘం అధ్యక్షులు రవిచందర్ చౌహాన్, ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ బానోతు దుర్గాప్రసాద్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు మండల అధ్యక్షుడు బానోత్ రాంబాబు, కార్యదర్శి లకావత్ గణేష్, భారతీయ గోర్ బంజారా పోరాట సమితి సభ్యులు బానోత్ దేవిలాల్, భూక్యా హరిలాల్, బంజారా నాయకులు పాల్గొన్నారు.

## 17న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలి : సిపిఎం

**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** సెప్టెంబర్ 16వ తేదీన ఖమ్మం కళాక్షేత్రంలో జరిగే తెలంగాణ సాయుధ రైతంగ పోరాట వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఉమ్మ శ్రీను పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మేడిద పల్లి ఏలువారు గూడెం దమ్మాయిగూడెం పిండిప్రోలు వేదుల్ల చెరువు గ్రామాలలో సిపిఎం ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొమ్ము శ్రీను మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలు గ్రామ గ్రామాన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఈనెల 16న సాయంత్రం ఐదు గంటలకు భక్తురాందాస్ కాలక్షేత్రంలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు నాగాటి సురేష్ బందారపు సైదులు ఉపేందర్ రెడ్డి సయ్యద్ పత్తే అహ్మద్ మాచర్ల రాజశేఖర్ దిండు మంగపతి బోడపట్ల సతీష్ షేక్ రఫీ పొదిలా నగేష్ రావుల వెంకట రామిరెడ్డి నరేష్ రెడ్డి దేవరం రాంరెడ్డి నగేష్ తదితరులు పాల్గొన్నారు

## వర్షపు నీరు తగాదాల్లో వృద్ధునిపై గొడ్డలితో దాడి

...స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు



**తిరుమలాయపాలెం, సెప్టెంబర్14 (మనం న్యూస్):** వర్షపు నీరు పోకుండా వేసిన అడ్డుకట్టనీ తీస్తున్నారనే నేపథ్యంతో వృద్ధునిపై గొడ్డలితో తీవ్రంగా దాడి చేసి గాయపరచిన సంఘటన తిరుమలాయపాలెం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మీదేవి పల్లి, తండా గ్రామపంచాయతీ పరిధిలోని జండాల తండా, గ్రామానికి చెందిన మూడు భారతీయ వృద్ధుడు. తన వ్యవసాయ భూమి ఆవరణంలో వర్షం వచ్చినప్పుడు ఆ వర్షపు నీరు తన భూమి మీదుగా అవతల వైపు పోయే విధంగా గతంలో మోరి ఉండేది. ఆ మోరీని లక్ష్మీదేవి పల్లి, గ్రామానికి చెందిన మూడ్ లింగ, తండ్రి పేరు బావ్ సింగ్, అనే వ్యక్తి సిమెంట్ కాంక్రీట్ తో పూడ్చి వర్షపు నీరు పోకుండా అడ్డుకట్ట వేశారు. దీనిని బాధితుడు భారతీయ తొలగించారని కక్ష పెంచుకున్న నిందితుడు లింగ, బుధవారం సుమారు సాయంత్రం 5:30 ప్రాంతంలో బాధితుడు భారతీయ, మూడ్ సిరికలు, అనే వ్యక్తి ఇంటి దగ్గర కూర్చొని మాట్లాడుతున్న సమయంలో గోడ్డలితో దాడి చేశాడు. దీంతో గాయాలయ్యాయి. బాధితుడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

## ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో ఉచిత ఆహారం పంపిణీ

**భద్రాచలం, సెప్టెంబర్ 14( మనం న్యూస్ ) :** అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో భద్రాచలం ఏరియా హాస్పిటల్ లో 'ఉచిత ఆహారం' అనే కార్యక్రమంలో భాగంగా హాస్పిటల్ లోని రోగులకు, వారి సహాయకులకు ఉచిత భోజన ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, అలాగే ఏరియా హాస్పిటల్ ఆర్ఎమ్ఓ రాజశేఖర్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఫౌండేషన్ వారు ప్రతి నెల ఆహారాన్ని ఉచితంగా అందించడం మంచి కార్యక్రమమని అభినందించారు. అలాగే ఎంతోమంది పేదలు, వైద్యం కోసం భద్రాచలానికి నలువైపుల వున్న గ్రామాలనుంచి రోగులు ఏరియా హాస్పిటల్ కి వస్తూ ఉంటారని, వారికి ప్రతి నెల మంచి భోజనాన్ని అందిస్తున్నటువంటి ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఆర్ ఎం ఓ రాజశేఖర్ మాట్లాడుతూ ఫౌండేషన్ సభ్యులు కరోనా నుంచి కూడా వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి సభ్యులు అబ్దుల్ కలాం ఫౌండేషన్ అధ్యక్షులు మస్తాన్, ఉస్మాన్,ఇమామ్,అలీ,అమీర్, మై ది న్,ఖాయం పష,సాంబ,కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం

.. జెడ్పీటిసి పోశం నరసింహారావు

**మణుగూరు, సెప్టెంబర్ 14 (మనం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆదేశాలమేరకు పొడుతూరి విక్రమ్ అధ్యక్షతన మణుగూరు కోటకట్ట(హరిజనవాడ) 116వ బూత్ నందు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జడ్పిటిసి పోశం నరసింహారావు బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ముత్యం బాబు హాజరై ఈ ప్రచార కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా కోటకట్ట (హరిజనవాడ)నందు గడపగడపకు తిరుగుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే రేగా కాంతారావు చేసిన అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలను గురించి వివరించారు. రేగా కాంతారావు ని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. స్థానిక నాయకులు పొడుతూరి ముత్తయ్య, గుండోజి శ్రీనివాసాచారి, పాండు, మరికొందరు స్థానిక నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.



## కోతులను తరిమేందుకు స్కూల్ పిల్లలు

... బయటకు పంపించిన ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ... విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు

**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక గ్రామంలో ఓ ప్రైవేట్ పాఠశాల టీచర్లకు బడి పిల్లల చదువు చెప్పటం మీద లేని శ్రద్ధ కోతుల మీద ఉన్నట్లు తెలుస్తోంది. జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రైవేటు. పాఠశాలలో చదువుతున్న 6,7,8,9 తరగతుల పిల్లలను సుమారు 20 మంది విద్యార్థులను కోతులను ఊరు బయటకు తరమండి అంటూ బయటకు పంపించారు. విద్యార్థులు కోతులను తరుముకుంటూ నిత్యం భారీ వాహనాలతో రద్దీగా ఉండే రోడ్లపై పరుగెడుతున్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కోతులు తిరగబడి దాడి చేస్తే బాధ్యత ఎవరు వహిస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు దృష్టి పెట్టి పిల్లలతో పనులు చేయిస్తున్న స్కూల్ యాజమాన్యంపై కఠినమైన చర్య తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## అంగన్వాడి ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ఏఐటియూసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, వైస్ ఎంపీపీ రేస్ ఎల్లయ్య**




ఆళ్లపల్లి, సెప్టెంబర్ 14 (మనం న్యూస్): మండల కేంద్రంలో అంగన్వాడి ఉద్యోగస్తులు తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం తాసిల్దార్ కార్యాలయం నుండి ఆళ్లపల్లి బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిథులుగా నరాటి ప్రసాద్,రేసు ఎల్లయ్య లు పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనియెడల జేఏసీ తరపున ఉద్యోగస్తులకు అండగా పోరాటం చేయుటకు వెనకాడమన్నారు. అంగనవాడి ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్వాడి ఉద్యోగులకు గ్రావిటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెన్ఫిట్ టీచర్లకు 10 లక్షలు హెల్పర్లకు ఐదు లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మండల ప్రధాన కార్యదర్శి,అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు కరకపల్లి మమత, పూనెం సుజాత,తాటి రత్నకుమారి, అంగన్వాడి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టియుసి స్టేట్ జనరల్ సెక్రెటరీని కలిసిన ఓబి కాంట్రాక్ట్ వర్కర్లు




**మణుగూరు, సెప్టెంబర్ 14 (మనం న్యూస్) :** గురువారం ఉదయం 10 గంటలకు జిఎం ఆఫీస్ గెస్ట్ హౌస్ నందు ఐఎన్టీయూసీ ఓబి కాంట్రాక్టు వర్క్స్ యూనియన్ గౌరవ సలహాదారులు పుచ్చకాయల శంకర్ ఆధ్వర్యంలో ఐఎన్టియుసి జనరల్ సెక్రెటరీ త్యాగరాజు ని కలిసి కార్మికుల పలు సమస్యలపై చర్చించారు. సమస్యల పరిష్కారంపై అధికారులతో చర్చించి కార్మికులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని యూనియన్ నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మణుగూరు మండల ఐ ఎన్ టి యు సి ఉపాధ్యక్షులు జాన్ ,ఓబి యూనియన్ గౌరవ సలహాదారులు పుచ్చకాయల శంకర్ ,ఐ ఎన్ టి యు సి నాయకులు రాయలింగు మహాలక్ష్మి కంపెనీ ఓసి ఫోర్ దుర్గా కంపెనీ ఓసి టు దుర్గా కంపెనీ కమిటీ సభ్యులు కార్మికులు పాల్గొన్నారు.

## నకిలీ విలేకరుల అరెస్ట్

**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక గ్రామ పంచాయతీ లో గల ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విలేకరులమని చెప్పుకొని వసూళ్లకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను బూర్గంపహాడ్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. బూర్గంపహాడ్ మండలం సారపాక గ్రామం లోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విలేకరులమని చెప్పి అక్కడ ఉపాధ్యాయులను డబ్బులు డిమాండ్ చేశారు. అనుమానం వచ్చిన ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. వారిని నకిలీ విలేకరులుగా గుర్తించారు. ఉపాధ్యాయురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరు ఇటీవల కాలంలో చాలామంది వద్ద విలేకరుల పేరిట డబ్బులు వసూళ్లు చేశారని తెలిసిందన్నారు.



## వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమే




**భద్రాచలం, సెప్టెంబర్ 14( మనం న్యూస్ ):** స్థానిక ఏఎంసి కాలనీలో మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా మాల మహానాడు అధ్యక్షులు అల్లాడి పౌల్ రాజు మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమేనన్నారు. విద్యా ఉద్యోగ ఉపాధి రంగాలలో ఎస్సీ ,ఎస్టీలకు రావలసిన వాటా చందకుండా రాజకీయ పార్టీలే కుట్రలు చేసి పాలకులు పరిపాలన కొనసాగిస్తున్నారు. ఈ సమావేశంలో సురేష్,ముత్యాల రావు,. సాగర్,వెంకట్రావు,. నాగబాబు,దిలీప్,అచ్చుత్ కుమార్, ఉదయ్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ చేసేదాకా పోరాటం ఆగదు



**భద్రాచలం, సెప్టెంబర్ 14( మనం న్యూస్ ):** ఎస్సీ వర్గీకరణ కోసం రిలే నిరాహార దీక్షలో భాగంగా గురువారం మహిళా నాయకులు సుహాసిని సూర్య వాణి ఆధ్వర్యంలో భద్రాచలం కేంద్రంలో దీక్ష ప్రారంభించారు. మహిళా నాయకులు మాట్లాడుతూ వెంటనే ఎస్సి వర్గీకరణ చేయాలన్నారు.ఆర్టికల్ 341, సవరణ చేసి ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధ కల్పించి, మాదిగ మాదిగ కులాలకు న్యాయం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలోముద్ద పిచ్చయ్య దళిత సంక్షేమ సంఘం అధ్యక్షులు, చర్మకారుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య సముపార్జనే దివ్యాంగులకు అభివృద్ధి

– జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల – దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 14 (మనంప్రతినిధి):** విద్య సముపార్జన ద్వారానే దివ్యాంగులు అభివృద్ధి సాధించగలరని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు . గురువారం పాత కొత్తగూడెంలోని తెలంగాణ పాఠశాలలో విద్యాశాఖ , సమగ్ర శిక్షా మరియు అలింకో కంపెనీ ఆద్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు ఏ విషయంలోను తక్కువ కాదని , ఆత్మన్యూనతను విడనాడి అన్ని రంగాలలో రాణించాలని చెప్పారు . జిల్లాలో దాదాపు 1700 మంది దివ్యాంగ విద్యార్థులున్నారని , వారిలో ఉపకరణాలు అందచేయడానికి నియమించిన కమిటి పారదర్శకంగా 445 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు . ఈ ఉపకరణాలు దివ్యాంగ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని , ఇతరులపై ఆధారపడకుండా స్వశక్తితో ముందుకు సాగేందుకు దోహదపడతాయని చెప్పారు. మున్సిపల్ ఛైర్పర్సన్ సీతాలక్ష్మి మాట్లాడుతూ, దాదాపు 35 లక్షల విలువగల ఉపకరణాలు అందించినట్లు చెప్పారు . అనంతరం దివ్యాంగులకు ఉపకరణాలు అందించి జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు . అనంతరం ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు . చిన్నారులతో కొద్దిసేపు ముచ్చటించి చిన్నారులు పలకలపై వ్రాసిన అక్షరాలను పరిశీలించారు . స్కూలు బావుందా అంటూ చిన్నారులను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారి , జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి విజేత , ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రవిబాబు , డాక్టర్ వెంకన్న , డాక్టర్ హిమబింధు , డాక్టర్ కోటేశ్వరావు , కౌన్సిలర్లు పరమేష్ యాదవ్ , విజయ్ , ప్రసాద్ , అకడమిక్ కో ఆర్డినేటర్లు సైదులు , నాగరాజ శేఖర్ పాల్గొన్నారు .

## ఛార్జ్ షీట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మద్ది శ్రీనివాస్ రెడ్డి



**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** హైదరాబాద్ గాంధీ భవన్ లో గురువారం అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఛార్జ్ షీట్ కమిటీ చైర్మన్ సంపత్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉద్యోగాల కల్పనలో తెలంగాణా ప్రభుత్వ వైపల్యాల గురించి టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఛార్జ్ షీట్ కమిటీ సభ్యులు డాక్టర్ మద్ది శ్రీనివాస్ రెడ్డి ప్రసంగించారు. తెలంగాణలో మొత్తం 20 వేల టీచర్ ఉద్యోగాల ఖాళీలు ఉంటే, కేవలం 6612 పోస్టులను మాత్రమే ప్రకటిచారని విమర్శించారు. ఇంకా చాలా డిపార్ట్మెంట్ లలో పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రభుత్వం, పోస్టులు నింపకుండ మీనమేషాలు లెక్కపెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ చైర్ మన్, మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్, టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్ రెడ్డి , సభ్యులు బెల్లయ్య నాయక్, మెట్టు సాయి కుమార్, భవాని రెడ్డి, సతీష్ తదితరులు పాల్గన్నారు.

# అభివృద్ధి పేరుతో విధ్వంసానికి పాల్పడుతున్న మున్సిపల్ శాఖ

– సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా – లేపాక్షి రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన సిపిఐ బృందం



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 14 (మనంప్రతినిధి):** రోడ్ల విస్తరణ చేపడుతూ అభ్యద్ధి పేరుతో మున్సిపల్ శాఖ అధికారులు విధ్వంసానికి పాల్పడుతూ గృహ యజమానులను, వ్యాపారస్తులను బయభ్రాంతులకు గురిచేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా అన్నారు. కొత్తగూడెం పట్టణ పరిధిలోని లేపాక్షి తాటిపెల్లి రోడ్డులు చేపడుతున్న విస్తరణ పనులను బాదితుల అభ్యర్థన మేరకు గురువారం సిపిఐ నేతలు, కౌన్సిలర్ల బృందం పరిశీలించింది. విస్తరణ జరుగుతున్న తీరుపై బాదితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ పట్టణ ప్రజల సౌకర్యంకోసం అభివృద్ధి పనులు చేస్తే కమ్యూనిస్టు పార్టీ స్వాగతిస్తుందని, ఐతే గృహ యజమానులు, వ్యాపారవర్గాల స్థిరాస్తులను ధ్వసం చేస్తూ రోడ్ల విస్తరణ చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఎన్నో ఏండ్లుగా స్థిర నివాసాలు, వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న వారిని నిర్వాసితులను చేయడం సరైందికాదన్నారు. లేపాక్షి రోడ్డులో ఇప్పటికే గృహాలు, వ్యాపార సముదాయాలు కూల్చి డ్రైనేజీ నిర్మాణం కోసం కందకాలు తవ్వారని, ఇంతటితో సరిపెట్టుకోకుండా అదనంగా డ్రైనేజీ నుంచి 3 నుంచి 6 ఫీట్ల వరకు ఉన్న నిర్మాణాలను సైతం కూల్చివేసేందుకు మార్కింగ్ చేసి బయభ్రాంతులకు గురిచేయడం సరైందికాదన్నారు. అదనపు కూల్చివేతలకు స్వస్తి చెప్పి డ్రైనేజీ నిర్మాణాలను, రోడ్డు విస్తరణను చేపట్టాలని లేనిపక్షంలో గృహయజమానులకు, వ్యాపారవర్గాలకు అండగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ అధికారులతో ఫోన్లో సంప్రదించి అదనపు విస్తరణ పనులను నిలిపివేయాలని సూచించారు. ప్రతినిధిబృందంలో మున్సిపల్ సిపిఐ పక్ష నాయకులు, పట్టణ కార్యదర్శి వై.శ్రీనివాసరెడ్డి, సహాయ కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్, కౌన్సిలర్లు, కంచర్ల జమలయ్య, భూక్య శ్రీనివాస్, బాజోజు రవికుమార్ తదితరులు ఉన్నారు.

## నాలుగవ రోజుకు అంగన్వాడిల నిరవధిక సమ్మె

...సంఘీభావం ప్రకటించిన సీఐటీయూ, ఏఐటీయుసి నేతలు



**ఇల్లందు, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** ఇల్లందు సీఐటీయు, ఏఐటియుసి ల కార్మిక సంఘ నాయకు లు ఏఐటీయూసీ. కే. సారయ్య. సిఐటియు జిల్లా నాయకులు అబ్దుల్ నబీ. ల ఆధ్వర్యంలో గురువారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు గత మూడు రోజుల నుండి నిర్వహిస్తున్న సమ్మెను లాంఛనంగా ప్రారంభించారు. గత మూడు రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి టీచర్లు ఆయాలు రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోవడం తీవ్రంగా ఖండించారు., ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్ వాడి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ 26000 లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలోఏఐటియుసి దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, సిఐటియు నుండి తాళ్లూరి కృష్ణ, కూకట్ల శంకర్, ఆర్బిజే రాజు, టీ డీ పీ నేత ముద్రగడ వంశీ, సీ హెచ్ రమేష్ బాబు. లు సంఘభావం తెలిపారు.ఈ సమ్మె లో ఈసం వెంకటమ్మ కే మరియ, ఫాతిమా,రాంబాయి ,మమత,నాగలక్ష్మి, వసంత కారం పద్మ సుజాత వెంకట రమణ అరుణ,వెంకటమ్మ, యాకమ్మ,సావిత్రి,వనజ, జయప్రద శారద పద్మ,సోమలక్ష్మి,సమ్మెలో పాల్గొన్నారు.

# జోరుగా సాగుతున్న మట్టి తవ్వకాలు



**అశ్వారావుపేట టౌన్, సెప్టెంబర్ 14 (మనం న్యూస్ ):** అశ్వారావుపేటలో జోరుగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. తవ్వకాలకు పర్మిషన్లు ఉన్నాయా అని అడిగితే అన్ని ఉన్నాయంటున్నారే గాని పేపర్లు చూపించడం లేదని తెలుస్తోంది. గురువారం ఉదయం నుంచి జరుగుతున్న మట్టి తవ్వకాలు సమయం రాత్రి 8 కావస్తున్నా గాని ఆగలేదు. ఇదేమ ని అడిగితే మీకెందుకు చూపియ్యాలని ట్రాక్టర్ డ్రైవర్లు అంటున్నారు. వారం రోజుల నుంచి జోరుగా తవ్వ కాలు సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ తవ్వకాలను బి ఆర్ఎస్ నాయకులు వెనకమాలకొమ్ముకాస్తున్నట్టు సమాచారం. చాలా నిర్లక్ష్యంగా డాక్టర్ల డ్రైవర్లు వాహనాన్ని నడుపుతున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. కనీసం 20 సంవత్సరాలు కూడా నిండకుండా యువతని డ్రైవర్ లాగా ట్రాక్టర్ల యజమానులు విని యోగించుకుంటున్నారు. వాళ్లకు ఎటువంటి పర్మిషన్లు పేపర్లు అవసరం లేదంటూ అడుగుతున్న ప్రజా ప్రతినిధులపై తిరగబడుతున్నారు. ఏ అధికారులు కూడా అటువైపు చూపు కూడా వేయకపోవడం చాలా బాధాకరంగా ఉందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఆ టాక్టర్లు వచ్చే మూడు గ్రామాలు ఉండడంతో చాలా స్పీడ్ గా ట్రాక్టర్లను నడుపుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పుడు దాకా ఎటువంటి ప్రమాదం జరగలేదు కానీ జరిగితే ఎవరు బాధితులని ఆ గ్రామస్తులు చెపుతున్నారు. ఆ గ్రామంలో చిన్నారులు ఉన్నారు స్కూళ్లు ఉన్నాయి. తెలియక చిన్న పిల్లలు రోడ్డు మీదకి వచ్చారనుకో ఏదైనా ప్రమాదం జరిగితే దీనికి ఎవరు బాధ్యత అని గ్రామస్తులు అంటున్నారు. అసలు మట్టి గాని ఇసుకకు గాని తవ్వకాలకి పర్మిషన్ లేదంటున్న ప్రభుత్వం వీళ్లకు ఎలా ఇచ్చింది పర్మిషన్లు అని గ్రామస్తులు నిలదీస్తున్నారు. ఇలాగే ఇష్టరాజ్యం కింద తవ్వుకొని పోతే లాస్ట్ కి మట్టి దెబ్బలు తవ్వుకొని పోతే మట్టి కరువవుతుందని గ్రా మస్తులు పేర్కొంటున్నారు.

## ఓటరు అవగాహనా సదస్సులో పాల్గొన్న ఎంపీపీ





**అశ్వాపురం, సెప్టెంబర్ 14 (మనం న్యూస్) :** తహశీల్దార్ కార్యాల యంలో ఓటర్ అవగాహన సదస్సును గురు వారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండలం ఎంపీపీ ముత్తినేని సుజాత పాల్గొన్నారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు, బూత్ లలో సమస్యల పై ఐటి డిప పిఓ చర్చించారు. ఈ కార్యక్రమం లో అశ్వాపురం తహశీల్దార్ రమాదేవి, మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్, మొండికుంట సొసైటీ చైర్మన్ తుక్కని మధుసూదన్ రెడ్డి, ఎంహెచ్పీ రాష్ట్ర యువజన అధ్యక్షుడు గొల్లపల్లి నరేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు బైగాని శివ గౌడ్, ఐలపాక వరప్రసాద్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో విద్యార్థి పోరాటాలు ఆపలేరు



**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 11 (మనం న్యూస్) :** ఆరోగ్య శాఖ మంత్రి ఖమ్మం జిల్లాలో పర్యటన సందర్భంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వామ పక్షాల విద్యార్థి సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే అరెస్ట యిన వారిని విడుదల చేయాలని పిడిఎస్యు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి జి మస్తాన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5,135 కోట్ల రూపాయల స్కాలర్షిప్ మరియు ఫీ –రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఏఎన్ఎం, జిఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయ పోస్టు లను భర్తీ చేయాలన్నారు.

# వసతి గృహాలలో వార్డుల పైశాచికత్వం

## ...నిబంధనల పేరుతో విద్యార్థి తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్న వైనం



**ఇల్లందు, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** ఇల్లందు పట్టణంలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో గురువారం మీడియా, విద్యార్థి సంఘాలతో పాటు, విద్యార్థుల తల్లిదండ్రులకు కూడావసతి గృహంలోకి అనుమతించడం లేదని తెలుస్తుంది. గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాలలోకి మీడియా, విద్యార్థి సంఘాలను రానివ్వకూడదని ఆదేశాలు ఉన్నప్పటికీ అవే ఆదేశాలను కొందరు వార్డెన్లు అతిగా తీసుకొని వారి లోపాలను బయటకు రానీయకుండా ఉపయోగించుకుంటున్నారని పి డి ఎస్ యు విద్యార్థి సంఘు నాయకులు కాంపాటి పృథ్వీ, ఏఐఎస్ఎఫ్. నాయకులు హారీష్ గౌడ్. ఆరోపించారు. వసతి గృహ విద్యార్థినీలకు వారి తల్లిదండ్రులు పండ్లు, ఇతర తిను బండారాలు ఇవ్వాలంటే గేట్ల పై నుండి సర్కస్ చేసి ఇవ్వాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహ విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చినా గేట్లు తెరవటం లేదని దానితో పిల్లలకు తల్లిదండ్రులు ఏమి తెచ్చిన గేటు పైకి ఎక్కి అందివాల్సి వస్తుందని . గోడలు ఎక్కి తమ పిల్లల్ని చూసుకోవటం, గేట్లు ఎక్కి తమ పిల్లలకు ఇవ్వాల్సినవి అందించడం విద్యార్థినీల తల్లిదండ్రులకు ఇబ్బందిగా మారిందని విమర్శించారు. ఇదే వసతి గృహంలో పాఠశాల నిర్వహణ సమయంలోనే విద్యార్థులతో పనులు చేపిస్తూ, కూరగాయలు శుభ్రం చేయించటం, కూరగాయలను తరగటం చేయిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని అదే నిజమైతే వార్డెన్ పై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారుల ను డిమాండ్ చేశారు.

## మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



**ఏన్కూరు, సెప్టెంబర్ 14(మనం న్యూస్):** స్థానిక గురుకుల విద్యాలయంలో గురువారం మండల స్థాయి క్రీడల పోటీలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తోపాటు అథ్లెటిక్స్ లలో పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎంపీపీ ఆరేం వరలక్ష్మి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం, మార్చ్ ఫాస్ట్ కార్యక్రమాలు జరిగాయి. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, సమైక్యతకు దోహదపడతాయని వక్తలు అన్నారు. క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దిశా కమిటీ సభ్యులు బాదావత్ బాలాజీ, ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ వాసిరెడ్డి వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్నబాబు, ఆరెం రామయ్య, దాసరి రమేష్, పిఈటిలు రామారావు, శ్రీరాములు, లక్ష్మణ్, శోభన్, వీరన్న, శారద, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పూసుకుంట గ్రామాన్ని సందర్శించిన తహశీల్దార్



**దమ్మపేట, సెప్టెంబర్ 14(మనం న్యూస్)** : మండలంలోని గిరిజన గ్రామీణ పూసుకుంటను గురువారం ఉదయం దమ్మపేట తహశీల్దార్ ముజాయుద్దీన్ సందర్శించారు. గ్రామంలోని ఓటర్ వివరాలు పరిశీలించి వారితో మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్ గా నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పూసుకుంట సర్పంచ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రీన్ భద్రాద్రిలో భాగస్వామినైనందుకు ఆనందంగా ఉంది : కె. అబ్రహం



**భద్రాచలం ,సెప్టెంబర్ 14( మనం న్యూస్):** గ్రీన్ భద్రాద్రి వారి ఆధ్వర్యంలో స్థానిక అభయాంజనేయ స్వామి పార్క్ నందు సెయింట్ పాల్స్ అధినేత కె.అబ్రహం ముఖ్య అతిథిగా పాల్గొని వారి స్కూల్ విథ్యార్థులతో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ భావి భారతావని విథ్యార్థుల చేతుల్లోనే ఉన్నదని , పర్యావరణ పరిరక్షణ పై ప్రతి విథ్యార్థి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రతి విథ్యార్థి మొక్కలు నాటటం అలవాటుగా మార్చుకోవాలన్నారు. తాను గ్రీన్ భద్రాద్రి లో భాగస్వామినైనందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు బెల్లంకొండ రాంబాబు,కోశాధికారి విష్ణుమొలకల సుబ్రహ్మణ్యం , మాజీ అధ్యక్షులు గోళ్ళ భూపతి రావు,కామిశెట్టి కృష్ణార్జున రావు,సెయింట్ పాల్స్ అధ్యాపకులు రాజు,బాబా , అగష్టీన్ ,వినోద్,అరుణ ఉమా భారతి,విథ్యార్థిని,విథ్యార్థులు పాల్గొన్నారు.

## నానునాగర్ తండా పాఠశాలకు సైన్స్ స్టేషనరీ పంపిణీ



**కారేపల్లి, సెప్టెంబర్14 (మనం న్యూస్):** మండల పరిధిలోని నానునగర్ తండ ప్రాథమిక పాఠశాలకు గురువారం ఎంపీపీ నిధుల నుంచి ఎంపీపీ మాలోత్ శకుంతల సైన్స్ స్టేషనరీ అందజేశారు. సైన్స్ పాఠ్యాంశాలు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేందుకు సైన్స్ సైన్స్ స్టేషనరీ ఉంటే ఉపయుక్తంగా ఉంటుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు ఎంపీపీ దృష్టికి తీసుకుని వెళ్లడంతో స్పందించిన ఎంపీపీ విద్యార్థుల కోసం స్టేషనరీని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాఠశాలల్లో విద్య ఉన్నతంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఎంఈఓ జయరాజు, ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మొండికుంట రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన



**అశ్వాపురం, సెప్టెంబర్ 14 (మనం న్యూస్) :** అశ్వాపురం మండలంలోని ప్రధాన రహదారి వద్ద నుండి గొందిగూడెం మీదుగా ఐదు మారుమూల గ్రామాలను అనుసంధానం చేసుకుంటూ మొండికుంట వరకు సుమారు 6 కోట్ల అంచనా వ్యయంతో వెయ్యనున్న రోడ్డు పనులను అశ్వాపురం మండల యూత్ అధ్యక్షులు గద్దల రామకృష్ణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం గ్రామ శాఖ అధ్యక్షులు జూపల్లి కిరణ్, రాయపూడి అశోక్, మడిపల్లి రమేష్, రావుల వెంకటేశ్వర్లు, జన్ని రాజశేఖర్, ఈయన పెళ్లి వెంకన్న, కమ్మ శేషగిరి, కొమ్ము వెంకన్న మరియు గ్రామ పెద్దలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## ఏజెన్సీ ప్రాంతంలో షెడ్యూల్ ట్రైబల్స్ కి మాత్రమే ప్రమోషన్స్ కల్పించాలి

– ఏటిఏ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయ బాబు.. ... రేగా ఆధ్వర్యంలో కేటీఆర్ కు వినతి పత్రం అందజేత...



**కరకగూడెం, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** ఏజెన్సీలో బదిలీలు పదోన్నతులు మైదాన ప్రాంతం టు మైదాన ప్రాంతం, ఏజెన్సీ టు ఏజెన్సీ మాత్రమే నిర్వహించాలని డిమాండుతో ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు ఆధ్వర్యంలో కేటీఆర్ కి వినతి పత్రం అంద చేశారు. ఈ సందర్భంలో కేటీఆర్ స్పందించి వెంటనే సంబంధిత గిరిజన శాఖ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ కి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టియనాకి ఫోన్ చేసి వారితో ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో షెడ్యూల్ ట్రైబల్స్ కి స్థానిక ఉద్యోగ నియామకాలు, పదోన్నతులు కల్పించేందుకు ట్రైబల్ అడ్వైజరి కన్సిల్ ఏర్పాటుకు తక్షణమే ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయ బాబు ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులుపూనెంశ్రీనివాస్.ఈ కార్యక్రమంలో ఏటిఏ రాష్ట్ర నాయకులు పూనెం సారయ్య,ముడిగ సమ్మయ్య,కోరం శ్రీనివాస్, పాయం రంగారావు, మోకాళ్ళ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం నూతన కమిటీ ఎన్నిక..



**కరకగూడెం, సెప్టెంబర్ 14 (మనం న్యూస్):** జాతీయ ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం కరకగుడెం నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. నూతన కమిటీ ఎన్నికకు ముఖ్య అతిథిగా అభ్యుదయ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు వజ్జ నరసింహారావు దొర ఆధ్వర్యంలో నూతన కమిటీనీ ఎనుకున్నరు. నూతన కమిటీ అధ్యక్షులుగా గోగ్గల రవి, ఉపాధ్యక్షులుగా గోగ్గల సతీష్, ప్రధాన కార్యదర్శిగా గోగ్గల కృష్ణ, కార్యదర్శి చందా రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా చందా శ్యాంసుందర్, ప్రచార కార్యదర్శిగా కొమరం సత్యనారాయణ, కోశాధికారిగా ఊకే సారయ్య, కార్యవర్గ సభ్యులుపోలే బోయిన ప్రేమ్ కుమార్, పోలే బోయిన నరసింహారావు. పోలెబోయిన గణేష్చందా, అశోక్ ఎన్నికైనారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు గుగ్గల రవి మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతకు ఈ కమిటీ నిరంతరం పనిచేస్తుందన్నారు. తమ మీద నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యత అప్పజెప్పిన కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్‌జిఎఫ్ క్రీడలను ప్రారంభించిన జడ్పిటిసి పైడి



**దమ్మపేట, సెప్టెంబర్ 14(మనం న్యూస్) :** దమ్మపేట మండలంలో ఎస్జి ఎఫ్ క్రీడలను ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో జెడ్పీటిసి పైడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఇదే సందర్భంగా క్రీడలను నిర్వహించే ఫిజికల్ డైరెక్టర్లకులకు సుమారు 40 మంది కి జడ్పిటిసి సొంత ఖర్చులతో క్రీడా దుస్తులను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కీసరి లక్ష్మి, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జున రావు, పి టి రామనాథం, హెచ్ఎం బజ్జూరి వెంకటేశ్వరరావు, జగపతి , మస్తాన్ వలి, పాఠశాల యాజమాన్యం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మనం

# మహబూబాబాద్

## జాతీయ సమైక్యత దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి...

**కలెక్టర్ శశాంక మహబూబాబాద్, సెప్టెంబర్ 14(మనం ప్రతినిధి) :** జాతీయ సమైక్యత దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. గురువారం ఐ.డి.ఓ.సి. లోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ సమైక్యత దినోత్సవ ఏర్పాట్లపై ఎస్పీ చంద్రశేఖర్ తో కలిసి సంబంధిత జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఈ నెల 17వ తేదీన జాతీయ సమైక్యత దినోత్సవాన్ని ఐ.డి.ఓ.సి.లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర గిరిజన సంక్షేమం, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటున్నందున పోలీస్ శాఖ గౌరవ వందనం ఇస్తారని, సి.పి.ఓ. స్పీచ్ ఏర్పాట్లు చేయాలని, విద్యా శాఖ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యుత్ శాఖ నిరంతరం విద్యుత్ సరఫరా కు, ఉద్యాన శాఖ అధికారి అలంకరణ కు, విద్యుత్ దీపాలు అలంకరణ , స్టేజి ఏర్పాట్లు ఆర్.అండ్.బి అధికారులు చూడాలన్నారు.అనంతరం అల్పాహారం కార్యక్రమం ఉంటుందన్నారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చెన్నయ్య, జడ్పి సి.ఈ.ఓ. రమాదేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.





**గణేష్ ఉత్సవాలు నిమజ్జనం ప్రశాంత వాతావరణం లో నిర్వహించాలి**

గణేష్ ఉత్సవాలు నిమజ్జనం కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక తో చేపట్టాలని జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. గురువారం ఐడిఓసిలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గణేష్ ఉత్సవాలు నిమజ్జనం కార్యక్రమాలపై ఎస్పీ చంద్రశేఖర్ తో కలిసి సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 18వ తేదీన వినాయక చవితిని పురస్కరించుకొని గణేష్ ఉత్సవాల నిర్వహణ కోసం విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు పోలీస్ విద్యుత్ శాఖల ముందస్తు అనుమతులు పొందాలన్నారు. నవరాత్రులు కొనసాగే ఉత్సవాలలో ఎటువంటి అవాంతరాలు వాటిల్లకుండా ఉత్సవ కమిటీ నిర్వాహకులు బాధ్యత వహించాలని వాలంటీర్లను నియమించుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు చెరువులు కాలువలు వద్ద పరిరక్షణకు సిబ్బంది కి విధులు కేటాయించాలన్నారు. చెరువులలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను ముందస్తుగా తొలగింప చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనంలో గజ ఈత గాళ్లను మాత్రమే నియమించాలని మత్స్య శాఖ అధికారిణి ని ఆదేశించారు. పోలీస్ శాఖ క్రేన్ తోనే విగ్రహాలను నిమజ్జనం చేయించాలన్నారు.కేసముద్రం, దంతాలపల్లి మండలాలపై దృష్టి పెట్టాలని డి.పి.ఓ.ను ఆదేశించారు.నెల్లికుదురు, కేసముద్రం,గూడూరు మండలాలలో తప్పకుండా క్రేన్ ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక , విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. వైద్య శాఖ అధికారులు శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమన్వయ సమావేశంలో జడ్పి సి.ఈ.ఓ.రవమాదేవి, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు పాల్గొన్నారు.

**మాను కోటను సుందరంగా తీర్చిదిద్దుతాం: కలెక్టర్ శశాంక**

మానుకోట ను సుందరంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు.గురువారం మహబూబాబాద్ మున్సిపల్ అభివృద్ధి పనులను పరిశీలించేందుకు స్థానిక శాసనసభ్యులు బాణోత్ శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి తో కలిసి కలెక్టర్ సందర్శించి పనులను పర్యవేక్షించారు. తొలుత మహబూబాబాద్ పట్టణం లోని నెహ్రూ సెంటర్ నుండి పత్తిపాక రహదారి విస్తరణ పనులు పరిశీలిస్తూ ప్రజాప్రతినిధులు, వర్తకులు సహకరించాలని కోరారు. వివేకానంద విగ్రహం నుండి ఈదుల పూస పల్లి వెళ్లే రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తదనంతరం ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధి పనులు పరిశీలిస్తూ పలు సూచనలు సలహాలు ఇచ్చారు. చేపట్టే పనులు ఉపయోగకరంగా ఉండాలన్నారు.ఐ డి ఓ సి వద్ద కురవి రోడ్డులో నిర్మిస్తున్న నూకల రామచంద్రారెడ్డి విగ్రహ స్థాపన పరిశీలించారు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారుకలెక్టర్ వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ కౌన్సిలర్ వెంకన్న , 34 వార్డ్ కౌన్సిలర్ గుండా స్వప్న పోతురాజు, మున్సిపల్ డి ఈ ఉపేందర్ జిల్లా యువజన క్రీడల అధికారి అనిల్ కుమార్ ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రెపోని లో మృతుడి కుటుంబానికి పరామర్శ

### –ఎమ్మెల్యే డి యస్ రెడ్యానాయక్

**దంతాలపల్లి సెప్టెంబర్14 (మనం న్యూస్) :** మండలంలోని రేపోని గ్రామంలో కొంపెల్లి బక్కయ్య ఇటీవలే మృతి చెందగా,మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన డోర్నకల్ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యా నాయక్,వారి కుటుంబాన్నీ ఓదార్చి వారి కుటుంబానికి అండగా ఇంటామని,వారికి ధైర్యం చెప్పారు ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్ రెడ్డి రైతు సమన్వయ సమితి కో ఆర్డీనేటర్ వొలాద్రి మల్లారెడ్డి,ధర్మరపు వేణు, రేపోని సర్పంచ్ శైలజ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర స్థాయి బహుమతి పొందిన దంతాలపల్లి విద్యార్థులు..

### –ప్రశంసించిన యూనిసేఫ్ ప్రతినిధులు



**దంతాలపల్లి, సెప్టెంబర్14 (మనం న్యూస్):** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత ను వెలికి తియ్యడానికి ప్రతి సంత్సరం ఆగస్టు14 జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో టాప్10 నిలిచిన దంతాలపల్లి మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు డి రాకేష్,బి సతీష్ లు జాతీయ స్థాయి కి ఎంపికైనట్లు ప్రదనోపాధ్యాలు బుధారపు శ్రీనివాస్ తెలియజేసారు. విద్యార్థులను గైడ్ చేసిన సోషల్ ఉపాధ్యాయులు బ్రహ్మమనంద రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ్య స్థాయిల విద్యార్థుల మంచి సృజనాత్మకతను కనబరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు, విద్యార్థులను యూనేసేఫ్ ప్రతినిధుల బృందం ప్రశంసించినట్లు తెలిపారు.



## హామీలను విస్మరించిన బీఆర్ఎస్

### డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి రాంచంద్రునాయక్

**మరిపెడ, సెప్టెంబరు 14(మనం న్యూస్):** బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని, ఎన్నికల తరుణంలో కొత్త కొత్త పథకాల పేరుతో మభ్యపెట్టి ప్రజలను మోసం చేయాలని చూస్తోందని డోర్నకల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి రాంచంద్రునాయక్ ఆరోపించారు. గురువారం ఆయన మరిపెడ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ఉద్యమకారులకు జరుగుతున్న అన్యాయంపై పోస్టు కార్డు ద్వారా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీతో కుమ్మక్కయ్యి, తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి, వేల కోట్లు అక్రమంగా కూడబెట్టుకున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మరిపెడ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరా రెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ తాజోద్దీన్, సోంలా తండా సర్పంచ్ కృష్ణా, నాయకులు అప్సర్, గంగయ్య, ఐలమల్లు, తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ సర్పంచులకు సన్మానం

**మరిపెడ, సెప్టెంబరు 14(మనం న్యూస్):** స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్–2023 అవార్డులలో భాగంగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం నుంచి ఉత్తమ గ్రామపంచాయతీగా అవార్డుకు ఎంపికైన బీచ్ రాజు పల్లి (2 వేల వరకు జనాభా క్యాటగిరిలో) తండా ధర్మారం (2 వేల నుండి 5 వేల వరకు జనాభా క్యాటగిరిలో) ఎల్లంపేట(5 వేల పైన జనాభా కేటగిరిలో) అవార్డులు పొందాయి. ఈ సందర్భంగా గురువారం మరిపెడ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మరిపెడ ఎంపీపీ గుగులోతు అరుణ రాంబాబు ఆయా గ్రామపంచాయతీ ల సర్పంచ్ లు తాళ్లపల్లి శ్రీను ఎల్లంపేట గుగులోతు లక్ష్మి లక్పతి తండా ధర్మారం నాతి కృష్ణ బీచ్ రాజు పల్లి లను ఎంపీడీవో కేలోతు ధన్సింగ్, ఎంపీఓ పూర్ణచందర్ రెడ్డి, సూపరిండెంట్ శేషశయనం, కార్యదర్శులు సురేష్,నరేష్ లను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.



## అట్టహాసంగా ప్రారంభమైన మండల స్థాయి స్కూల్ గేమ్స్

**గార్ల, సెప్టెంబర్ 14(మనం న్యూస్) :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగే హైస్కూల్ గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ మండలస్థాయి ఆటల పోటీలను స్థానిక జడ్పీఎస్ఎస్ గార్ల పాఠశాల ఆవరణ యందు మండల పరిషత్ అధ్యక్షులు మూడు శివాజీ చౌహాన్ ప్రారంభించారు. మండల స్థాయిలో ఆడి ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఆటగాళ్లను ఈనెల 17వ తారీఖున జరిగే జిల్లా స్థాయి ఆటల పోటీల్లో పాల్గొనవలసి ఉంటుందని పిడి శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు కదీర్ బాబా, స్థానిక ఎంపీటీసీ రమేష్ ,ఉపాధ్యాయ సంఘ నాయకులు మాలోత్ శివ, రామచంద్రు, బొజ్యా, కబ్బాకుల వెంకన్న, ఎస్ వెంకటేశ్వర్లు, పుష్పకుమారి, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయుల మండల అధ్యక్షులు శ్రీను, హరి, బిచ్చ, విజయకుమార్, శంకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.